# చెబితే వినరు... ఈసీ గిచ్చితే ఏడుస్తారు..



పెన్‌కౌంటర్

-తుర్లపాటి నాగభూషణరావు

> ఎన్నికల నియమావళి పట్టించుకోరు
> ఈ ఘనులు ఈసీనే సవాలు చేస్తారు!
> మంత్రులూ కోడ్ గీత దాటేవాళ్లే...
> ప్రజాస్వామ్యాన్ని పరిహసించేవాళ్లే

ప్రజాస్వామ్య చట్రంలో ఎన్నికల నిర్వహణ ఓ కీలక ఘట్టం. రాచరిక వ్యవస్థను రూపుమాపి ప్రజలే పాల కులని చేసిన మహోన్నత వ్యవస్థ మనది. అలాంటి ప్రజాస్వామ్య వ్యవస్థను మనకుమనమే గొడ్డలితో నరు క్కుంటున్నాం. మనం గీసుకున్న గీతలను మనమే చెరిపేసుకుంటున్నాం. ప్రజాస్వామ్యానికి చెరుపు చేస్తున్నాం. ఎందుకని ఇలా జరుగుతోంది...? దీనికి బాధ్యులెవరూ...?

ఎన్నికలన్నవి ప్రజాస్వామ్యబద్ధంగా జరుపుకో వడంకోసం ఏర్పాటు చేసుకున్న కేంద్ర ఎన్నికల సంఘాన్నీ, ఆ సంఘం రూపొందించిన విధివిధా నాలను (కోడ్)నీ యధేచ్ఛగా అపహాస్యం చేసేవాళ్ల సంఖ్య మన రాష్ట్రంలో కూడా రోజురోజుకీ పెరిగిపో తున్నది. బీహారు తరహా ఎన్నికల వాతావరణం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏర్పడినట్టు కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తున్నదంటే దానిబట్టి అర్థం చేసుకో 'వచ్చు...మన వాళ్లు ఎంత ముదుర్లో...

## మొట్టికాయలు

ప్రస్తుతం రాష్ట్రంలో ఉపఎన్నికల వేడి రాజుకుంది. ఈ ఉపఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫి కేషన్ జారీ చేయడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వా నికిగానీ, లేదా ప్రజాప్రతినిధులూ, అధికారులకు గానీ మొత్తంగా ఏడు సార్లు ఈసీ 'మొట్టికాయలు' వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈసీకి క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి తలెత్తిందంటే ఉల్లంఘన స్థాయి తీవ్రతని అర్థం చేసుకోవచ్చు.



రమాకాంత్ రెడ్డి

'ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఏమవ ుతోందీ...మహా అయితే క్షమాపణ చెబుతాం... కేంద్రం లోనూ, రాష్ట్రంలోనూ మన ప్రభుత్వాలే ఉన్నా యి ఏం చేసినా మనకు తిరుగులేదు...' అన్న భావన అధి కార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల్లోనూ, అధికార గణంలోనూ పేరుకుపోయిందనడానికి ఈ ఏడు మొట్టి కాయలే 'సాక్షి' అన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఈసారి ఈసీకి దొరికిపోతున్నారు. ఎన్నికల కోడ్‌ను పదేపదే ఉల్లంఘిస్తుండటంతో ఈసీ అగ్గిమీద గుగ్గిలమే అవుతోంది. మండే ఎండలకంటే ఈసీ వేడే ఎక్కువ అవుతుందంటూ అధికార పార్టీ శ్రేణులు కలవర పడుతున్నాయి. అయినా ఉల్లంఘనలు మాత్రం ఆగడంలేదు. ఓటర్లను ఆకర్షించే రీతిలో కొత్త నిర్ణ యాలు తీసుకుంటునే ఉన్నారు. వరాలను నిర్భ యంగా ఇచ్చేస్తూనే ఉన్నారు. 'నిబంధనలు ఉంటే



చిన్నా రెడ్డి,

మాకేంటీ...' అంటూ నాయకులు యథేచ్ఛగా పాఠశాలల్లోనూ, ఆలయాల్లోనూ బహిరంగసభలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు, అధికారులు సైతం నేతలకు యథాశక్తిన సాయపడుతున్నారు. మొత్తంగా ఈసీని అపహాస్యం చేస్తున్నారు. దీంతో ఈసీ భగ్గు మంటోంది. కొరడా ఝుళిపిస్తోంది.

దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ర్వహించడం కోసం రాజ్యాంగబద్ధంగా రూపొందిన ఎన్నికల కమిషన్ కళ్లుగప్పాలనీ, లేదా ధిక్కరించాలన్న ధోరణి సహించరానిది. అధికార మదం పేరుకుపోతే వచ్చే దుష్ఫలితాలు ఇలాగే ఉంటాయని విశ్లేషకులు అంటున్న మాటలు నిజమ నిపించేలా సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.



రఘువీరా రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమాకాంత్ రెడ్డి మీద, వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరారెడ్డి మీద కొరడా ఝుళిపించిన ఈసీ ఇప్పుడు తాజాగా ఒకే రోజున ముగ్గురు మంత్రులు, ఇద్దరు ఎమ్మెల్యేలకు ఈసీ నోటీసులు జారీచేసింది. అంతేకాదు, ఓ జిల్లా కలెక్టర్, ఎస్పీలపై కూడా కన్నెర్ర చేసింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు జె. చిన్నారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, జానారెడ్డిలకూ, ఎమ్మెల్యేలు కొండా సురేఖ, స్వర్ణ సుధాకర్‌లకూ ఈసీ నోటీసులు ఇచ్చింది.

## వైఎస్ 'అతి' విధేయత !

ముఖ్యమంత్రితో సహా నలుగురు మంత్రులను ఎన్నికల సంఘం తప్పుపట్టడం కమిషన్ చరిత్రలోనే ఇదే ప్రథమం కావడం గమనార్హం. 'నిబంధనలను తుంగలొకి తొక్కైనా గెలవాలి సుమా...' అని ఈ మంత్రులకు ఎవరు చెబుతున్నారోగానీ వారికి ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల అణుమాత్రం గౌరవం లేదనే అనుకోవాలి. ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖరరెడ్డి మాత్రం తనకూ, తన ప్రభుత్వానికీ ఎన్నికల కమిషన్ పట్ల ఎనలేని విధేయత ఉందనే చెబుతు న్నారు. ఏకంగా ముగ్గురు మంత్రులపై తాజాగా ఈసీ తప్పుపట్టిన తరువాత వైఎస్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం పట్ల తమకు పూర్తి గౌరవం ఉందనీ, తమ పార్టీ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా గౌరవిస్తోందనీ, ఏ ఒక్కరూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించ కూడదన్నదే తన అభిమతమని ఉద్ఘాటించారు.

## ప్రవీణ్ ఉదంతం...

ఈ సందర్భంగానే మరో విషయం కూడా చెప్పుకో 'వాలి. మూడేళ్ళ క్రితం ప్రవీణ్ ప్రకాష్ విశాఖపట్నం కలెక్టర్‌గా ఉన్నప్పుడు అప్పట్లో జరిగిన ఉపఎన్నికల సందర్భంగా ఈసీ అనుమతి లేకుండా ప్రవీణ్ ప్రకాష్ రిటర్నింగ్ అధికారిని బదలీ చేశారు. దీంతో ప్రవీణ్‌పై చర్య తీసుకోవాల్సిందిగా ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న టి.కె.దివాన్ చార్జిషీట్‌ను తనవద్దే అట్టిపెట్టుకున్నారు. ఇలా ఎందుకు జరిగిందో వివరణ ఇవ్వమని ఈసీ పదకొండుసార్లు నోటీసులు జారీ చేసినా ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. అంతేకాదు, ఇటీవలే ప్రవీణ్‌పై చార్జిషీట్‌ను సర్కారు మూసేసింది. 'ప్రవీణ్ ప్రకాష్‌పై మేం ఆదేశించిన కఠిన చర్యలు ఏవీ?' అంటూ ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతూనే ఉంది.



కానీ ఏలినవారి దగ్గర నుంచి బదులేలేదు. దీన్ని కూడా ఈసీ పట్ల వారికి ఉన్న 'అతి విధేయత'గానే ఏలినవారు చెప్పుకుంటారా...?

ఎన్నికల సంఘం పట్ల - ఎన్నికల కోడ్ పట్ల గౌరవమున్న ఏ ప్రభుత్వమైనా ఎన్నికల సంఘం ఆదేశాలకు కట్టుబడి చర్యలు తీసుకుంటుంది. కానీ మన 'అతి విధేయ ప్రభుత్వమే' ఏమాత్రం పట్టించుకోవడంలేదు. మరి దీనికి ముఖ్యమంత్రి ఏమని సమాధానం ఇస్తారు?

## కొత్త దారులు!

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంలో నాయకులు ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. అభివృద్ధి అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. అసలు ఈ ఉపఎన్నికలు రావడం వల్ల, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందనీ, దీంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని కాంగ్రెస్ నేతలు లబోదిబో మంటున్నారు. అయితే ఉపఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది ఇప్పుడే. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా పాలనలో ఉంది. మరి ఇన్నాళ్లూ అభివృద్ధి గురించి మాట్లాడకుండా ఇప్పుడేదో కొంపలు మునుచుకుపోయినట్టు మాట్లాడటంలోనే వాళ్ళ తెంపరితనం బయటపడుతోంది. ఎలాగైనా ఎన్నికల కోడ్‌కు చిక్కకుండా పబ్బం గడుపుకోవాలన్న తపన కనబడుతోంది.

## వికటించిన 'అభివృద్ధి' మంత్రం

ముఖ్యమంత్రి అభివృద్ధి మంత్రంతోనే ప్రచారంలోకి దిగమని చాలా స్పష్టంగా చెప్పారు. కనుక మంత్రులకూ, దిగువ శ్రేణి నాయకులకూ 'అభివృద్ధి మంత్ర' జపమే



శరణ్యమైంది. కానీ ఇదే అభివృద్ధి మంత్రం ఇప్పుడు వాళ్ల పీకలకు 'ఈసీ తాడులై' చుట్టుకుంటున్నాయి. అభివృద్ధి పథకాల గురించి చెప్పీచెప్ప గానే అది కోడ్ ఉల్లంఘన కిందకు వచ్చేస్తున్నది. దీంతో ఎవరో గిట్టని వాళ్ళు ఈసీకి ఫిర్యాదు చేయ డం, ఈసీ మండిపడటం జరుగుతోందని ఓ ఎమ్మెల్యే ఈ ప్రతినిధి వద్ద వాపోయారు. తప్పు తమ అధినా యకుని వద్ద పెట్టుకుని ఇప్పుడు ఈసీని నిందిస్తే ఎలా? అందుకే నాయకగణం లబోదిబోమంటోంది. ఎన్నికల ప్రచారంలోకి దిగిన కాంగ్రెస్ నేతల పరిస్థితి ఎలా ఉన్నదంటే...'అభివృద్ధి మంత్రం జపించకపోతే వైఎస్‌కు కోపం...అలా అని జపించడం మొదలుపెడితే ఈసీకి కోపం...' ఈ ఉపఎన్నికల ప్రచారంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మంత్రులు కోడ్‌ను పక్కన చుట్టేసి వరాలు గుప్పిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పిల్లి పాలు తాగుతూ ఎవ్వరూ చూడటంలేదన్నట్టుగా అధికార పక్షం నేతలు వ్యవహరిస్తుంటే ఈసీకి చిర్రెత్తుకొస్తోంది. అందుకే ఇప్పుడు ఈసీ గరంగరంగా నోటీసులు జారీ చేసింది.

తాము చేసిన తప్పుని ఈసీ గమనిస్తోందని తెలియగానే నేతలు శ్రీరంగ నీతులు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వరంగల్ జిల్లాలోని ఒక పాఠశాల భవనంలో మంత్రులు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, హన్మకొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొండా సురేఖలు ఎన్నికల సభ నిర్వహించారన్న ఆరోపణ ఎన్నికల సంఘం దృష్టికి వచ్చింది. ఈ విషయం తెలియగానే నేతలు బుకాయింపు మాటలు చెప్పసాగారు. 'అబ్బే...స్కూళ్లో సభ జరగలేద'ని కలెక్టర్ చేత సర్దిచెప్పించే ప్రయత్నం చేశారు. అయితే ఈసీ మాత్రం ఊరుకోలేదు. బీహార్‌లో ఇలాంటి సంఘటనలను ఎన్నో చూసిన ఈసీ తన 'దారి'లో తాను విచారణ చేపట్టింది. ఆరా తీయడం మొదలుపెట్టింది. ఈ సభకు అనుమతే లేదని ఈసీ గ్రహించింది.

మంత్రుల సంగతి ఇలా ఉంటే, ముఖ్యమంత్రి వైఎస్ కూడా కోడ్‌ని పక్కనపెట్టేసి యథేచ్ఛగానే సాగుతున్నట్టు ఈసీ దృష్టికి ఆరోపణలు వెళ్ళాయి. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటిస్తున్నప్పుడు ఒక రోజు నిర్ణీత సమయానికి మించి గంటా 15 నిమిషాల పాటు అధికంగా ప్రచారం చేసినట్టు ఆరోపణలు ఈసీ వద్దకు చేరాయి. అంతేకాదు, ఉపఎన్నికల్లో తమ పార్టీ ఎలా గెలవాలన్నది నిజానికి ఆ పార్టీ సొంత వ్యవహారం. కానీ మన ముఖ్యమంత్రిగారు ఈ అంశంపై ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే చర్చించారు. దీనిపై లోక్‌సత్తా పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసింది.

## 'మిస్టర్ చీఫ్ మినిస్టర్'పై ఆరా?

ఇక్కడ టిడీపీ హయాంలో జరిగిన సంఘటన ఒకటి చెప్పుకోవాలి. అప్పట్లో 'దూరదర్శన్' ముఖ్యమంత్రితో ఒక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుండేది. దాని పేరు - 'ప్రజలతో ముఖ్యమంత్రి'. ఎన్నికల వేళ ఈ కార్యక్రమాన్ని కూడా నిలిపివేయాలని అప్పట్లో ఈసీ ఆదేశించింది. కానీ ఇప్పుడు మాత్రం ఒక ప్రైవేట్ ఛానెల్‌లో ప్రభుత్వ నిధులతో యథేచ్ఛగా 'మిస్టర్ చీఫ్ మినిస్టర్' పేరిట వారానికి ఓరోజు (ప్రతి సోమవారం) క్రమం తప్పకుండా ప్రసారమవుతూనే ఉంది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం నిధులు వెచ్చిస్తుందంటూ వచ్చిన ఆరోపణలను సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ పార్థసారథి త్రోసిపుచ్చారు. ఈసీకి ఆయన వివరణ ఇస్తూ... 'ఇది ఆ టివీ ఛానెల్ నిర్వహిస్తున్న కార్యక్రమమే కానీ, ప్రభుత్వం ఎలాంటి పారితోషికం ఇవ్వడంలేద'ని వివరణ ఇచ్చారు. అయితే విశ్వసనీయంగా తెలిసిన విషయమేమంటే...ప్రభుత్వం నేరుగా ఇవ్వకపోయినా ఒక సంస్థకు ఈ మొత్తం ఇస్తోంది. ఆ సంస్థ ద్వారా సొమ్ము సదరు టివీ ఛానెల్‌కు అందుతోంది. దొడ్డి



దోవన 'పని' చక్కబెట్టుకోవడంలో కాంగ్రెస్ సర్కార్ దిట్ట అనడానికి ఇదే ప్రత్యక్ష 'సాక్షి'. ముఖ్యమంత్రి కుమారుడు జగన్ నడుపుతున్న ఒక పత్రిక నిధుల విషయంలో కూడా ఇలాంటి దొడ్డిదోవలు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరే, అది ఈసీ పరిధికి రాదు కాబట్టి ఇక్కడ దాని గురించి వివరణ ఇవ్వదలుచుకోలేదు. దొడ్డిదోవన వచ్చినా మొత్తానికి ప్రభుత్వ నిధులతో ఒక కార్యక్రమం ప్రసారం అవుతున్నందున దాన్ని ఎన్నికల వేళ నిలిపివేయాలని కోరడంలో తప్పులేదుగా..కాగా, ఈవిషయంలో ఈసీ మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. కోడ్ ఉల్లంఘనపై ప్రజాప్రతినిధులపైనే కాకుండా కలెక్టర్, ఎస్పీలతో పాటు సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం తాజాగా నిర్ణయం తీసుకుంది.

మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చేసింది. దీంతో ఉపఎన్నికలు జరిగే చోట్ల అధికారగణానికి ముచ్చెమటలు పోస్తున్నాయి. తమ ప్రమేయం లేకుండా మంత్రులూ, అభ్యర్థులూ ఎన్నికలు జరిగే జిల్లాల్లో ఇష్టానుసారంగా కోడ్‌ని ఉల్లంఘిస్తే దానికి తామెలా బాధ్యులమవుతామని అధికారులు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఈసీ కొరడా ఝుళిపించడం మొదలు పెట్టేసరికీ, అందరిలో ఉలుకుపాటు ఎక్కువైంది. 'టేకిట్ ఈజీ...' అని ఇంత వరకూ ఈసీపై కామెంట్ చేస్తున్నవారు ఇప్పుడు 'ఈసీ' అన్న పేరు వినగానే ఉలిక్కిపడుతున్నారు. కోడ్ గీత దాటితే కొంపకొల్లేరు అవుతుందన్న సంగతి ఇప్పటికైనా దారితప్పుతున్న వారు గ్రహించాలి. లేకుంటే ఈసీ వీళ్ళను ఈడ్చి కొట్టడం ఖాయం. మున్ముందు మరింత కష్టాల్లో పడటం అంతకన్నా ఖాయం. ప్రజాస్వామ్యబద్ధంగా సాగే ఎన్నికలకు ఎవ్వరు అడ్డుతగిలినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. అప్పుడే ప్రజాస్వామ్యం సజావుగా నడవగలుగుతుంది.